క్లుప్తంగా

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జమీర్

కెరమెరి: ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న బీఎల్‌వోలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఎండీ జమీర్ అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన పనులన్నీ సక్రమంగా చేయాలని పేర్లు చేర్పించడం, తొలగించడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రిపోర్టులు సరైన విధంగా నమోదు చేయాలన్నారు. ఆర్‌ఐలు సిద్ధార్థ, వివేక్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు అందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన బెండారే నాందేవ్, బెండారే వాగు కుటుంబాలకు గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నిత్యావసర సరుకులు అందజేశారు. అగ్ని ప్రమాదంలో అన్నదమ్ములిద్దరి ఇళ్లు దగ్ధమవడంతో దాతలు బాధిత కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం డి.రమేశ్, తిరుపతి, సీఆర్పీ జి.ప్రకాశ్, నాయకులు దోని రవి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ స్థలం పత్రాలు అందజేత

కెరమెరి: మండలంలోని తుమ్మగూడ ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి దేవాపూర్ శివారులో సర్వే నెంబర్ 12లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. గురువారం ఆ స్థలానికి సంబంధించిన పత్రాలను తహసీల్దార్ జమీర్ వైద్యాధికారికి అప్పగించారు. సబ్ సెంటర్ భవనం గతంలో మంజూరైంది. కాని స్థలం లేకపోవడంతో నిర్మాణం నిలిచింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆదేశాలతో తహసీల్దార్ మూడు గుంటల స్థలాన్ని కేటాయించారు.


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంతోపాటు రిక్షా కాలనీలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కమలాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో చెట్లు తొలగించనుండడంతో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

పేదింటి యువతి పెళ్లికి చేయూత

నార్నూర్: పేదలకు చేయూత అందించేందుకు శ్రీ సంత్ సేవా సమితి సేవాభావంతో పని చేస్తోందని సమితి అధ్యక్షుడు సందీప్‌రాథోడ్ అన్నారు. గురువారం నాగల్‌కొండ గ్రామానికి చెందిన రాథోడ్ లలి తబాయి నూర్‌సింగ్ దంపతులు కూతురు రాథోడ్ ఆశ్విని పెళ్లి చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో రూ. 5వేలు, అదే గ్రామానికి చెందిన జాదవ్ సురేశ్ కవితకు రూ. 5వేలు అందజేశారు.

రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సాకటి దశరథ్

బజార్‌హత్నూర్: రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. గురువారం మండలంలోని చందునాయక్‌తండా గ్రామంలో పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తమవిగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ, మాధవ్‌రావ్ ఆమ్టే, సూర్యకాంత్‌గిత్తే, చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, బత్తిని సుధాకర్ యాదవ్, భీంరెడ్డి, బాబారావ్, ప్రకాశ్, సంతోష్ పాల్గొన్నారు.

పుస్తక దాతలు కావలెను!

- గోయగాం విద్యార్థుల లైబ్రరీ నిర్వహణ
- ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ముందుకు
- సొంతంగా వసతులు సమకూర్పు



లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులు

కెరమెరి: వారందరు పేద విద్యార్థులు..వారి తల్లిదండ్రుల్లో కొందరు కూలి చేసుకుని కుటుంబాన్ని పోషిస్తుంటే.. మరికొందరు వ్యవసాయదారులుగా ఉన్నారు. వారి కష్టాలను కళ్లారా చూసిన విద్యార్థులు ఏదో ఒక ఉద్యోగం సాధించి వారిని గట్టెక్కించాలని భావించారు. అదే తడువుగా అందరు కలిసికట్టుగా వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. తాము ఉంటున్న గోయగాం గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మార్చిలో గ్రామ పంచాయతీలో ఉన్న ఓ గదిని గ్రంథాలయంగా మార్చారు. ప్రస్తుతం తెల్లవారుజాము నుంచి రాత్రి 12 గంటల వరకు కూడా ఆ విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

ఆసిఫాబాద్ గ్రంథాలయానికి..

రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. గత సంవత్సరం ఫిబ్రవరి వరకు గోయగాం గ్రామానికి చెందిన సుమారు 15 మంది నిరుద్యోగులు ఆసిఫాబాద్‌లోని గ్రంథాలయానికి వెళ్లి చదువుకునేవారు. ప్రతిరోజు బస్సు చార్జీల కోసం రూ.100 వెచ్చించేవారు. ఇలా ఏడాదిగా వారి ప్రయాణం సాగింది. ప్రతినెల ఒక్కొక్కరు రూ.3 వేలు ఖర్చు చేశారు. అనంతరం కాలక్రమేణా ఆసిఫాబాద్‌కు చెందిన విద్యార్థుల సంఖ్య పెరగడం, లైబ్రరీలో వీరికి కుర్చీలు లభించేవి కావు. దీంతో గోయగాంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సావర్‌ఖేడా హెచ్‌ఎం కడెర్ల రంగయ్య పుస్తకాల కొనుగోలుకు రూ. 10 వేలను అందజేశారు. ఆయన విరాళంతో కొనుగోలు చేసిన పుస్తకాలను ప్రస్తుతం చదువుకుంటున్నారు. ఈనెల 8న అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆ గ్రంథాలయాన్ని సందర్శించి ర్యాక్‌లు, కంప్యూటర్ అందజేస్తామన్నారు. కాని ఇంకా అవి అందలేదు.

మరిన్ని పుస్తకాలు అవసరం!

ప్రస్తుతం ఏ ఉద్యోగానికైన పోటీ విపరీతంగా పెరిగింది. అందుకు తగ్గట్టు సాధనతోపాటు నూతన పబ్లికేషన్స్‌కు చెందిన పుస్తకాలు అవసరముంది. అందరు పేద విద్యార్థులు కావడంతో రూ.వేల ఖరీదు చేసే పుస్తకాలను కొనుగోలు చేయలేని పరిస్థితి వారిది. పుస్తకాల భద్రపర్చేందుకు ర్యాక్‌లు అవసరముంది. అందుకు దాతల సాయం కోరుతున్నారు. మరో 40 రకాల పుస్తకాలు కావాలి. వాటిలో కొన్ని..ఎన్‌సీఈఆర్‌టీ అన్ని పుస్తకాలు, అర్థమెటిక్, రిసోనింగ్, జనరల్‌సైన్స్, ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇండియన్ హిస్టరీ, తెలంగాణ జియోగ్రఫీ, జీకే, కరెంట్ అఫైర్స్, ప్యూర్ మాథ్స్, వరల్డ్ జియోగ్రఫీ, టీఎస్‌పీఎస్‌సీ మోడల్ పేపర్స్, బిట్ బ్యాంక్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఎస్సెస్సీ సీజీఎల్ పేపర్స్, సీఆర్పీఎఫ్ బిట్‌బ్యాంక్ తదితరాలు ఉన్నాయి.



ర్యాక్‌లు లేక నేలపై ఉన్న పుస్తకాలు



గ్రంథాలయాన్ని సందర్శిస్తున్న అడిషనల్ కలెక్టర్

దాతలు ముందుకురావాలి



సొంతంగానే లైబ్రరీ నిర్వహిస్తున్నాం. సర్పంచ్ గది ఇవ్వడంతో ఇది సాధ్యమైంది. రాత్రి పగలు సాధన చేస్తున్నాం. పుస్తకాలు నేల పైనే ఉన్నాయి. వర్షం వస్తే తడిసే అవకాశం ఉంది. ర్యాక్‌లు, పుస్తకాలు చాలా అవసరముంది. దాతలు ముందుకొచ్చి సహకారం అందించాలి.

– గుర్నూలే ప్రశాంత్, విద్యార్థి, గోయగాం

కొనుగోలు కేంద్రాలేవి ?

- పంట అమ్ముకునేందుకు తిప్పలు
- ఇళ్లలోనే పంటల నిల్వ
- అవస్థలు ఎదుర్కొంటున్న అన్నదాతలు



కల్లాల వద్ద ఆరబెట్టిన ధాన్యం

బెజ్జూర్: ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకునేందుకు కేంద్రాలు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. బెజ్జూర్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు యాసంగి సీజన్‌లో వరి పంటలు సాగు చేశారు. మండల వ్యాప్తంగా 300 ఎకరాల్లో సాగైంది. కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుతం రైతుల ఇళ్లలో పంట నిల్వలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట తడిసిపోయింది. పంట ఆరబెట్టేందుకు ఆపసోపాలు పడుతున్నారు. అయినా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం లేదు. జిల్లాలోని ఆయా మండలాల్లో కేంద్రాలను ఇదివరకే ప్రారంభించారు. బెజ్జూర్ పరిధిలోని బెజ్జూర్, బారెగూడెం ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభం కాలేదు. పంట చేతికి వచ్చేవరకు ప్రకృతి కారణంగా నష్టపోతున్నామని, ఇప్పుడు పంట అమ్ముకునేందుకు తిప్పలు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారుల మోసం..

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో దళారులు రైతులను ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. ఇప్పటికే పంట ఆరబెట్టిన రైతులు నిల్వలు ఇళ్లల్లో ఉంచారు. క్వింటాల్‌కు రూ.1500 రూ.1600లకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి దళారులు వారిని నట్టేట ముంచుతున్నారు.

కేంద్రాలు ప్రారంభించాలి



ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు తడిసిపోయాయి. ఇళ్ల వద్దనే పంట ఆరబెట్టుకున్నాం. నెలల తరబడి ఇళ్లల్లో నిల్వ చేసుకోవడం కష్టంగా ఉంది. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి.

– టి.శ్రీకాంత్, సిద్దాపూర్

ఆదుకోవాలి



ప్రతి ఏటా ఎన్నో ఇబ్బందులతో పంటలు సాగుచేస్తున్నాం. ప్రస్తుతం పంటలు చేతికి వచ్చింది. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

– నికూరి నారాయణ, సిద్దాపూర్

వినియోగదారుల సమాఖ్య సంఘాలకు టెస్టింగ్ పరికరాలు

కైలాస్‌నగర్: వస్తువుల నాణ్యతను పరిశీలించేందుకు అవసరమైన పరికరాల కొనుగోలు కోసం ప్రభుత్వం జిల్లాలోని మూడు వినియోగదారుల సమాఖ్య సంఘాలకు రూ.10వేల చొప్పున నిధులను మంజూరు చేసింది. దీంతో పాలు, పెరుగు, నూనెలు, పప్పులు వంటి ఆహార పదార్థాలను పరీక్షించేందుకు అవసరమైన టెస్టింగ్ పరికరాలను ప్రతినిధులు కొనుగోలు చేశారు. గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్ తన కార్యాలయ ఛాంబర్‌లో వాటిని విడుదల చేశారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీడీ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వేతన సవరణ సాధించే వరకు పోరాడుతాం



మాట్లాడుతున్న రాజాబాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన సవరణ సాధించే వరకు పోరాడుతామని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలకత్తాలో శుక్రవారం జరగబోయే జేబీసీసీఐ సమావేశంలో మెరుగైన వేతన అలవెన్స్ కోసం హెచ్‌ఎంఎస్ ముందుండి పోరాడుతుందన్నారు. కొన్ని కార్మిక సంఘాలు యాజమాన్యానికి, యూనియన్ల అనుబంధ పార్టీలకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. అలాంటి సంఘాలు జేబీసీసీఐ సమావేశాల్లో అలవెన్సులపై నోరు మెదపకపోవడంతోనే సమావేశాలు వాయిదా పడుతున్నాయన్నారు. రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెరిగే విధంగా, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, అలవెన్సులు పెరిగేలా పోరాడుతున్న ఏకైక సంఘం హెచ్‌ఎంఎస్ మాత్రమేనన్నారు. ఇప్పటికే 19 శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్స్ సాధించామని, అదే తరహాలో అలవెన్సుల కోసం ఫ్రీజింగ్ లేకుండా అండర్ గ్రౌండ్ అలవెన్సులు పెరిగేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో బ్రాంచి కార్యదర్శి శివారెడ్డి, ఏరియా కార్యదర్శి ఎస్‌కే ఇనూస్, ఫిట్ కార్యదర్శులు శ్రీనివాస్, సంపత్, హాస్పిటల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఆర్గనైజర్లు సాహిత్, కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

ఏం కొనేటట్టు లేదు

- పెరిగిపోతున్న కూరగాయల ధరలు
- కొనాలంటే జంకుతున్న సామాన్యులు

కూరగాయల ధరలు ఇలా

	గత నెలలో (కిలో, రూ.)	ప్రస్తుతం (కిలోరూ.)
టమాట	10	40
బెండకాయ	20	40
పచ్చిమిర్చి	40	80
కాకరకాయ	40	80
అలసంత	30	40
క్యాలీఫ్లవర్	60	80
దొండకాయ	30	60
బీరకాయ	50	80
చిక్కుడుకాయ	60	80



కౌటాలలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కౌటాల: జిల్లాలో వేసవికాలంలో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. సామాన్యులు కొనలేని విధంగా వీటి ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గత రెండు, మూడు వారాల నుంచి వీటి ధరలు అమాంతం పెరుగుతూ వస్తోంది. మార్కెట్‌లో కూరగాయలు కొనాలంటే సామాన్యులు జంకుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ధరల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి.

తగ్గిన సాగువిస్తీర్ణం

కూరగాయల సాగు విస్తీర్ణం రానురాను తగ్గిపోతుండటంతో ధరలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. పంట నిల్వకు కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేదు. దీంతో పలువురు వ్యాపారులు కూరగాయల ధరలు ఇష్టారీతిన పెంచి విక్రయిస్తున్నారు. సాగునీటి సౌకర్యం లేకపోవడంతో జిల్లాలో కూరగాయల సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేస్తుండడంతో ధరలు అధికమవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధరల నియంత్రణపై పట్టింపేది?

కూరగాయాల ధరల నియంత్రణలో అధికార యంత్రాంగం విఫలమైంది. కూరగాయల ధరలతో పాటు బియ్యం, కందిపప్పు, మినపప్పు, శనగపప్పు తదితర ధరలు పెరిగిపోయాయి. ధరలను అదుపులో ఉంచాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తోందని సామాన్య, పేద తరగతి ప్రజలు ఆరోపిస్తున్నారు. రేషన్ షాపుల్లో 9 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని పేర్కొంటున్నారు.

కొనలేకపోతున్నాం



పొద్దంతా కూలీ పని చేసిన ఇంటికి సరిపడా కూరగాయలు కొనలేకపోతున్నాం. రోజ పనిచేస్తే కూలీ రూ.250 వస్తాయి. కూరగా యలు కొనాలంటే రూ.400 ఖర్చు వస్తోంది. కొనలేకపోతున్నాం. వీటి ధరలు తగ్గించాలి.– వందన, గృహిణి, యాపలగూడ

చర్యలు తీసుకోవాలి



కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. మార్కెట్‌లో ప్రతి వస్తువు ధరలు పెరగడంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు కూరగాయల ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి.

– శంకర్, కౌటాల

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ముత్నూర్ గురుకుల పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2 కోట్ల, 70లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రతీ మండలాల్లో గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్ నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, పీపీసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ తుమ్రం బాగుబాయి, కోరెంగా గాంధారి, విజయ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక



ప్రియ

నేరడిగొండ: నేషనల్‌మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు నేరడిగొండ జెడ్పీఎస్ఎస్ విద్యార్థిని సోలంకి ప్రియ ఎంపికైనట్లు ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. ప్రతీ సంవత్సరం దేశ వ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ 2022–23 పరీక్షలో నేరడిగొండ జెడ్పీఎస్ఎస్ విద్యార్థిని ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమేష్‌రావు తెలిపారు. హర్ష, సిద్దు నాయక్, స్రవంతి, అస్మిత, స్నితిక, హర్షిత, రాజేశ్వరి, అమృత్ కృష్ణ, శ్రీరాంలు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవీందర్

తలమడుగు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని సుంకిడి గ్రామంలో రైతువేదికలో విత్తన డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత తప్పకుండా రైతులకు రసీదు ఇవ్వాలని సూచించారు. దుకాణంలోని స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై రాయాలన్నారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, డీలర్లు, ఏఈవోలు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌పై అధ్యయనం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాధిక్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధరణి పోర్టల్‌పై రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనంలో భాగంగా జైనూర్ మండల కేంద్రంతో పాటు, సిర్పూర్(యూ) మండలం అల్లిగూడ, లింగాపూర్‌లోని రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కార మార్గాలను సూచించారు. ఇటీవల హైకోర్టు ధరణి రాష్ట్ర ప్రభుత్వానికి జారీ చేసిన ఉత్తర్వుల తెలుగు అనువాద కాపీలను వారికి అందజేశారు. ముఖ్యంగా గ్రామాల్లోని గిరిజనులు పట్టా మార్పిడి కోసం ధరణిలో నిర్దేశించిన రుసుము తాము కట్టలేమని, షెడ్యూల్ ప్రాంతంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. గిరిజన రైతుల అభిప్రాయాలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ బొర్కడె హేమంత్ సహదేవ్‌రావ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ అశ్రఫ్, సాధిక్ ఫౌండేషన్ సిబ్బంది అమీర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. గురువారం మండలంలోని కొర్టికల్(బి), చింతగూడ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు ఉన్న దృష్ట్యా గ్రీన్ మ్యాట్ వినియోగించాలని సూచించారు. అలాగే ప్రతిరోజు మొక్కలకు నీరందించి ఎండిపోకుండా చూడాలని ఆదేశించారు. సర్పంచులు, టీఏలు, ఎఫ్‌ఏలు ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

జైనథ్: కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గిమ్మ గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. డబ్బులు సంపాదించేందుకు రాజకీయాల్లోకి రాలేదని, కేవలం ప్రజాసేవ చేసేందుకు మాత్రమే వచ్చానని అన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

ఎదులాపురం: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం అల్లికోరి, చిచ్‌దరి, ఖానాపూర్ గ్రామాల ఆది వాసీ నాయకులు, ప్రజలతో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ సెడ్మాకి ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, చంటి, నాగర్కర్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com